యువతిపై అత్యాచారానికి పాల్పడ్డ హోంగార్డు

ప్రేమ జంటను బెదిరించి అత్యాచారం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: స్థానిక హోమ్ గార్డ్ ప్రేమజంటను బెదిరించి, ప్రేమికురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన విజయనగరం జిల్లా నెల్లిమర్ల పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన సంఘటన వివరాలివి... ఈ ప్రేమజంట ఫిర్యాదుతో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితురాల వివరాల ప్రకారం... ఒక ప్రేమజంట కొండవెలగాడ గ్రామ పరిధిలోని ఒక లేఅవుట్ లో కూర్చుని మాట్లాడుకుంటుండగా చూసిన హోం గార్డ్ తాను ఎస్సై అని వారిని బెదిరించాడు. అనంతరం ఆ అమ్మాయిని దిగబెడతానని చెప్పి నెల్లిమర్ల పట్టణానికి తీసుకొచ్చాడు. స్థానిక కొండపేట, తొంపలపేట మధ్యన చంపావతి నది ప్రాంతానికి తీసుకెళ్లి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. ఇదే విషయమై సదరు ప్రేమజంట నెల్లిమర్ల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు బొండపల్లి పోలీసుస్టేషన్లో హోమ్ గార్డుగా పనిచేస్తున్నాడు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

సంఖ్యలోనే ప్రశంసాపత్రాలు బహూకరణ

అధికారులకు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం : వచ్చే ఆగష్టు 15వ తేదీన జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వివిధ శాఖల జిల్లా అధికారుల ఆధ్వర్యంలో చేయాలని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. పిల్లల్లో దేశభక్తి భావన పెంపొందించే కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా అధికారులతో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ సమీక్ష నిర్వహించారు. యీ వేడుకల సందర్భంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు ఇవ్వనున్నామని, అయితే ఆయా శాఖల్లో చిత్తశుద్ధితో అత్యుత్తమ సేవలు అందించిన వారి పేర్లను మాత్రమే సిఫారసు చేయాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది పరిమిత సంఖ్యలోనే ప్రశంసాపత్రాలు బహూకరించడం జరుగుతుందని, అధికారులు దీనిని దృష్టిలో వుంచుకొని ప్రతి క్యాడర్ నుంచి ఉద్యోగులను సిఫారసు చేయాలన్నారు. ప్రతి ఏటా జరుపుకున్న తరహాలోనే పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, పథకాల లబ్దిదారులకు ఆస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. మైదానంలో ప్రదర్శన పూర్తయిన అనంతరం వీలైతే శకటాలను నగరంలో ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలోని పోలీస్ మైదానంలో ఆగష్టు 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు జిల్లా ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నగరంలోని ప్రజలు యీ ఉత్సవాలకు తరలిరావాలని కోరారు. నగరంలోని ప్రధాన కట్టడాలను, ముఖ్య కూడళ్లను విద్యుద్దీపాలంకరణ చేయాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్టు సిబ్బందితో వెట్టిచాకిరి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు సిబ్బందితో వెట్టి చాకరీ చేయిస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం సిపిఐ మండల నాయకులు మొయిద పాపారావుతో కలిసి ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్ వైజర్లు తదితర సిబ్బందితో వెట్టి చాకరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ ద్వారా కనీసం జీతాలు ఇప్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన జీతాలు, పిఎఫ్ డబ్బులు, ఈఎస్ఐ కార్డులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బంది, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సూపర్ వైజర్లకు ప్రభుత్వం జారీ చేసిన 549 జీఓ ప్రకారం కాంట్రాక్టు వర్కర్లకు రూ.16000, సెక్యూరిటీ గార్డులకి జీఓ నెంబరు 43 ప్రకారం రూ.12,688 చెల్లించాలని కోరారు.

ఉపాధ్యాయులు దాసరి నరసింహంకు ఘన సత్కారం

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో నెమలాం జెడ్పిహెచ్ఎస్ లో 35 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని రిటైర్ అయిన సందర్భంగా పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు దాసరి నరసింహం కు హెచ్ఎం జి శ్రీనివాసరావు సమక్షంలో సహోపాధ్యాయులు, గ్రామ పెద్దలు,విద్యార్థులు దాసరి సేవలు కొనియాడుతూ ఘనంగా సత్కరించారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: ఈ నెల 2, 3, 4 తేదీల్లో అనంతపూర్ జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగంలో జెజోష్ణప్రియ, బి.వరలక్ష్మి ఎస్. రోషన్, బంకురు. హాసిని క్రెడిట్ విభాగంలో పి.షర్మిల, ఎస్.జాజిలి, బి. ఆదిత్య ,ఎస్. నిహాల్, ప్రవీణ్ కుమార్, బొబ్బిలి శివరామకృష్ణ, పాల్గొంటున్నట్లు బొబ్బిలి తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ క్రీడాకారులు రాష్ట్రా స్థాయిలో పాల్గొనడం పట్ల బొబ్బిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షులు కూటమి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సబ్బాన శ్రీనివాసరావు, పొట్టేలు రవికుమార్, డీ. కళ్యాణ్, ఈ టీం మేనేజర్‌గా కె.అభినవ్ పాల్గొన్నారు.

ఆక్రమిత తోటపల్లి కెనాల్ ని అధికారుల పరిశీలన

విశాలాంధ్ర-పూసపాటిరేగ: మండలం లో ఈ నెల 20న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమ న్యలపై చర్చిస్తున్న సమయంలో గోవిందపురం గ్రామానికి సంబంధించి ఎంపీటీసీ దంగుడు బియ్యపు సునీత నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవ్ కి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు మంగళవారం తోటపల్లి కాలువ భూమిని ఆక్రమించి లేఅవుట్ ఏర్పాటు చేయడంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కెనాల్ యొక్క డ్రాయింగ్ అందుబాటులో లేకపోవడంతో పూర్తిస్థాయిలో గుర్తించలేక పోయామని పూర్తి రికార్డులతో వచ్చి పరిశీలిస్తామని స్థానిక రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గణపతి రావు ఆర్ఐ మాధురి గ్రామ సర్వేయర్లు తోటపల్లి కెనాల్ జెఈ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

రాజాం పట్టణ సీఐ కి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

విశాలాంధ్ర-రాజాం: విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గంలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసే విధంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని మహిళల రక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని రాజాం సిఐ మోహన్ రావు కి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి. గౌరీ శంకర్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాలో గంజాయి డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు సేవించే వారి సంఖ్య అధిక మొత్తంలో ఉన్నారు. ఇటీవల కాలంలో బాలికలు, మహిళ పై జరుగుతున్న లైంగిక దాడులు, దోపిడీ చేస్తున్న ఘటనలు చూస్తూనే ఉన్నాం. దీనికి ప్రధాన కారణం మాదకద్రవ్యాల చలామణి ఎక్కువగా ఉండటమే అన్నారు. కావున మహిళల రక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా పోలీసు శాఖ వారు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్యగా విజ్ఞప్తి చేస్తున్నాము అని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ కార్యదర్శి బి ప్రసాద్ ,రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వర పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తా...

నూతన తహసిల్దార్ రాజారావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : మండలంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపటమే లక్ష్యంగా పనిచేస్తామని చీపురుపల్లి నూతన తహ సిల్దార్ రాజారావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక తాసిల్దార్ కార్యాలయం నందు బాధ్యతలు చేపట్టారు. ఎన్ రాజారావు గతంలో విజయనగరం జిల్లా బాడంగి మండల తాసిల్దారుగా పనిచేసి ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల భాగంగా ఆయన చీపురుపల్లి బదిలీపై వచ్చారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ ఎం రాజారావు నకు చీపురుపల్లి మండల డీలర్స్ అసోసియేషన్ సభ్యులు. చీపురుపల్లి మండల తాసిల్దార్ సిబ్బంది. బొకేలతో అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీలర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలు సభ్యులు రామారావు చిట్టిబాబు డిప్యూటీ తాసిల్దార్, ఆర్ఐ, సర్వేయర్, పలువురు వీఆర్వోలు, తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జామి తహశీల్దార్ సీటు.. భలే క్రేజ్ గురూ..!

బదిలీలలో కొత్తగా వచ్చేదెవరో..?

హై రికమేండేషన్‌తో ఇప్పటికే ఒకరి పేరు వార్తల్లోకి!

హై రికమెండేషన్‌తో కొత్త తహశీల్దార్ వస్తున్నారా..!

విశాలాంధ్ర-జామి: జిల్లాలో కీలకమైన మండలాలలకు సైతం తహశీల్దార్ బదిలీలలో కొత్త నియామకాలు జరిగిపోయాయి. కొత్త తహశీల్దార్‌లు తమ విదుల్లోకి చేరిపోయారు. కానీ జామిమండలానికి మాత్రం కొత్త తహశీల్దార్‌ను నియమించకపోవడం విశేషం. ఇటీవల జరిగిన బదిలీలలో అనేకమంది పోటీలో ఉండడంతో జామికి ఖచ్చితంగా నియామకం అవుతుందని అందరూ భావించారు. కానీ జామిని మాత్రం పెండింగ్‌లో పెట్టడంతో అనేక ఊహాగానాలుకు తావిచ్చారు. ఎన్నికల బదిలీలలో భాగంగా విశాఖ జిల్లానుంచి వచ్చిన జి. రాంబాయిని ఇటీవల బదిలీలలో తిరిగి సొంతజిల్లాకు బదిలీ చేసారు. ప్రస్తుతం కొత్తతహశీల్దార్‌ను నియమించకపోవడంతో డిప్యూటీతహశీల్దార్ సునీతకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. మండలంలోని సమస్యలపై ఆమెకు పూర్తిస్థాయిలో పట్టు ఉండడంతో పాటు ఉద్యోగులు, సిబ్బందితో మంచి సత్సంభందాలు ఉండడం ఆమె విది నిర్వహణకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెప్పవచ్చు. మండలానికి వచ్చేందుకు అనేక మంది తహశీల్దార్‌లు ప్రయత్నాలు చేసినా ప్రస్తుతం ప్రభుత్వంలోని పెద్దల హై రికమెండేషన్‌తో ఓ తహశీల్దార్ ఇక్కడకు బదిలీపై వస్తున్నారనే పుకార్లు షికారు చేస్తున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఆయన ఇతర జిల్లాకు బదిలీపై వెళ్ళిపోయారు. ఇప్పుడు ఆజిల్లానుంచి నేరుగా జామి మండలానికే బదిలీ చేయించు కుంటున్నారనే వార్తలు రెవెన్యూ వర్గాలతోపాటు ప్రజలనుంచి వినిపిస్తోంది. స్థానికంగా అందరితో ఆయనకున్న పరిచయాలతో పాటు సమస్యలపై అవగాహన ఉండడంతో జామి మండలంలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిసింది. మరికొద్ది రోజులలో పోస్టింగ్ ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

టోల్ గేట్ టార్గెట్

అధికార విపక్షాలది ఒకేమాట

ప్రజా సంఘాల పోరుబాట

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా జొన్నాడ సమీపంలో బోడిమెట్టపాలెం దగ్గర జాతీయ రహదారి 26పై దగ్గర ఏర్పాటు చేసిన టోల్ గేట్ ను వెంటనే ఎత్తివేయాలని ప్రజా సంఘాలు పోరాటం ఉధృతం చేస్తున్నాయి. అధికార, విపక్ష నాయకులు సైతం పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనడం విశేషం. తాజాగా జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో భీశెట్టి బాబ్జీ చేపట్టిన ధర్నాలో టీడీపీ, వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, ఎమ్మెల్సీలు పివివి సూర్యనారాయణ రాజు, పి రఘువర్మ పాల్గొని. టోల్ ప్లాజా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రెడ్డి శంకరరావు ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. టోల్ గేట్ ఎత్తివేయాలంటూ ఛాంబర్ ఆఫ్ కామర్స్.ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం వంటి 20 సంస్థలు రౌండ్ టేబుల్ సమావేశంలో. డిమాండ్ చేసాయి. జొన్నాడ టోల్ ప్లాజా దగ్గర జూలై 2 నుంచి వసూళ్లు ప్రారంభించారు. దీని ప్రభావం వందలాది వాహనాలపై పడడంతో పాటు విజయనగరం విశాఖపట్నం మధ్య తిరిగే ఆర్టీసీ ఛార్జీలు కూడా పది రూపాయల వరకు పెరిగాయి. 26వ నెంబరు జాతీయ రహదారి మన జిల్లాలోని విజయనగరం, గజపతినగరం, రామభద్రపురం, పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు పట్టణాల మీదుగా ఒడిషా లో సునాబెడ, కొరాపుట్, జైపూర్, బొరిగుమ్మ పట్టణాలను వరకు సాగుతుంది.అక్కడ నుండి ఛత్తీస్‌గఢ్ లో జగదల్ పూర్, బస్తర్ మీదుగా రాయపూర్ వరకు కొనసాగుతుంది.మొత్తం 1448 కిలో మీటర్ల రహదారి లో మన రాష్ట్రంలో వున్నది కేవలం 90.33 కిలో మీటర్లు మాత్రమే. 2015లో అప్పటి కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు సిఫార్సు మేరకు రాజాపులోవ నుంచి చెల్లూరు వరకు 11.6కిలో మీటర్ల.మేర నాలుగు లైన్ల తో రహదారి నిర్మించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 84.12కోట్లు మంజూరు చేశారు.అయితే అప్పట్లోనే ఈ మార్గంలో టోల్ గేట్ ఏర్పాటు చేయాలన్న ఎన్‌హెచ్‌ఎఐ ప్రతిపాదనను అశోక్ గజపతిరాజు తిరస్కరించారు కూడా. ఈ నేపథ్యంలో ఎన్ హెచ్ ఎఐ రహదారి నిర్మాణం పూర్తి చేసినా టోల్ గేట్ వ్యవహారాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టింది. సుదీర్ఘ కాలం తరువాత అకస్మాత్తుగా జొన్నాడ దగ్గర టోల్ ప్లాజా ఏర్పాటు చేయడంతో జిల్లా వాసులంతా షాక్ అయ్యారు.జూలై 2 నుంచి వసూళ్లు ప్రారంభించడంతో ప్రజల్లో వెల్లువెత్తిన నిరసనలు కాస్తా ఉద్యమ రూపం దాల్చాయి. టోల్ ప్లాజా ఏర్పాటు ను ప్రజా సంఘాలతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా వ్యతిరేకిస్తున్నారు.మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లేఖ రాసారు. వాహనదారులపై ఆర్థిక భారం పడుతోందనీ,టోల్ గేట్ ఏర్పాటు చేసేముందు తీసుకోవాల్సిన చర్యలు కూడా చేపట్టలేదనీ పేర్కొన్నారు. జాతీయ రహదారి 26పై మొదవలస నుంచి గొట్లాం వరకు నాలుగు లేన్ల రహదారి పూర్తిచేసిన ఐదేళ్ల తరువాత టోల్ గేట్ పెట్టడం నిబంధనలకు విరుద్ధమని మంత్రి లేఖలో తెలిపారు. టోల్ ప్లాజా ను కొత్తగా ఏర్పాటు చేసిన విజయనగరం బై పాస్ లోకి తరలించాలని కోరారు. టోల్ గేట్ తరలించాలని విజయనగరం జిల్లా పరిషత్ లో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షత న జరిగిన సర్వ సభ్య సమావేశంలో తీర్మానం చేసారు. మరోవైపు ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రజాభీష్టం మేరకే టోల్ గేట్ పై నిర్ణయం వుండాలని కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేసారు.విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతి రాజుతో కూడా ఈ అంశంపై కలెక్టర్ చర్చించారు. జాతీయ రహదారుల పిడి ప్రభాత్ రంజన్ తో కూడా మాట్లాడారు. మొత్తంమీద విజయనగరం జిల్లా ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ సాగుతున్న టోల్ గేట్ నిరసన పోరాటాలకు సానుకూల ఫలితం వస్తుందని అంతా ఆకాంక్షిస్తున్నారు.

పంద్రాగస్టు స్టేట్ పేరెడ్‌కు కుమరాం స్కూల్ విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-జామి: ఈనెలలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పేరెడ్ నిర్వహించేందుకు మండలంలోని కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పాండ్రంకి హేమంత్‌కుమార్ ఎంపిక య్యారని జిల్లా స్కౌట్ సెక్రటరీ వి.చిన్నంనాయుడు తెలిపారు. ముఖ్యమంత్రికి గౌరవ వందనం నిర్వహించే కార్యక్రమానికి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడంతో స్కౌట్ మాస్టర్ గుండాల శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. హుమంత్ కుమార్ పాఠశాలలలో పదో తరగతి చదువుతున్నాడు.

ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల, విద్యార్థుల డేటాలో సవరణలు

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖాధికారులు రమణమూర్తి, చంద్రమౌళి లు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహణ లో ఓటర్ లిస్టులు ప్రదర్శించడం దగ్గర నుండి చైర్మన్ & వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం వరకు జరపవలసిన విధి విధానాల గురించి ప్రధానోపాధ్యాయులకు తెలియజేసారు. ఆన్లైన్లో ఉపాధ్యా యుల, విద్యార్థుల డేటాలో సవరణలు, విద్యాంజలి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అడ్మిషన్ వివరాలు, ఉన్నత పాఠశాలలో ప్రహరీ క్లబ్ లు ఆన్లైన్ వివరాలు నమోదు గురించి ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నూతన బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట మండల కేంద్రంలో ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ అధ్యక్షతన ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే లలిత కుమారి ఆధ్వర్యంలో నూతన అల్ట్రా పల్లె వెలుగు బస్సును పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు ఎస్.కోట నుంచి విశాఖ వరకు రూ.65ల ధరతో వెళ్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో రమేష్ మాట్లాడుతూ బస్సు డిపోకు మరిన్ని బస్సులు సిబ్బందిని కేటాయించాలని ఎమ్మెల్యే లలిత కుమారిని కోరడం జరిగింది అయితే దీనికి లలిత కుమారి సానుకూలంగా స్పందించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను కమిషనర్ నాయుడు పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్న అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. అన్నాక్యాంటీన్ల ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. డిఈలు, ఏఈలతో కలిసి అన్నా క్యాంటీన్లను పరిశీలించిన ఆయన కొన్ని సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నద్ధమైన అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని వసతులతో సౌకర్యవంతమైన అన్నా క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని రెండు చోట్ల అన్నా క్యాంటిన్ లను పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ఒకటి,నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో మరొకటి అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. రుచికరమైన ఆహారంతో పాటు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోండ్రు శంకుస్థాపన

రాజాం టౌన్‌లో ఏడుకోట్లతో డ్రైన్లు. సీసీ రోడ్లు పూర్తిచేస్తాం

విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం నాడు రాజాం టౌన్ లో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా రాజాం పట్టణ పరిధిలో గల గాయత్రీ కాలనీ గాయత్రీ దేవీ ఆలయం సమీపంలో 7.25 లక్షల వ్యయంతో కలవర్టర్లు కు శంకుస్థాపన చేశారు.చర్చి సమీపంలో గల వీధిలో 8 లక్షల వ్యయంతో కల్వర్టులకు శంకుస్థాపన.అలాగే తెలగావీధిలో 2.25 లక్షలవ్యయంతో మూడు కలవర్టు. డ్రయిన్.సీసీ రోడ్డు కు శంకుస్థాపన.వాసవీ థియేటర్ వెనక వీధిలో గల శ్రీరాంనగర్ కాలనీ లో 2.25 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు.పొనుగుటి వలసలో 8లక్షల వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ నెలరోజుల్లో మరో ఏడుకోట్ల రూపాయలతో రాజాం టౌన్ వీధుల్లో కాలువలు సీసీ రోడ్లకు నిధులు తెస్తామన్నారు.తెలుగుదేశం పార్టీ సంక్షేమం అభివృద్ధికి పుట్టినిల్లు అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో రాజాం లో అభివృద్ధి సంక్షేమం పూర్తిగా కుంటిపడిందన్నారు.ఈ తెలుగుదేశం ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కృషి చేస్తామన్నారు.అనంతరం రాజాం శ్రీనివాసా రోడ్డులో గల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసారు అలాగే సారధిలో గల బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేశారు.ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటు ఆరేసి చొప్పున వైట్, రూల్ నోట్స్, బ్యాగుతో సహా పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో కోండ్రు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల్లో చదివేవారికి ఇంటర్మీడియట్ బుక్స్ బయట కొనుగోలు చేయాలంటే తీవ్ర ఆర్థిక భారం అవుతోందని.ఎన్నికల సమయంలో ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచితంగా బుక్స్ అందజేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. నేడు ఈ హామీని నెరవేర్చి మాట నిలబెట్టామన్నారు. రాష్ట్రంలో గత అయిదేళ్లుగా గత ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యాప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మళ్లీ విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు ఉపాధ్యాయులంతా సహకరించాలని కోరారు. గతంలో మాదిరి ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారం, వేధింపులు ఉండవని తెలిపారు.విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా తీర్చి దిద్దలన్నారు. కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు.బిజెపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నేడు దాసులుపాలెం గ్రామ సందర్శన వాయిదా

విశాలాంధ్ర-లక్కవరపుకట: నేడు దాసులుపాలెం లో జరగబోవు గ్రామ సందర్శన వాయిదా పడినట్లు ఎంపీడీవో కే రూపేష్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పించన్ల పంపిణీ కార్యక్రమం ఉన్నందున గ్రామ సందర్శన వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు కనుక మండల స్థాయి అధికారులు గ్రామస్తులు గమనించగలరని ఆయన తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణం కొత్తగౌడు వీధిలో నివాసం ఉంటున్న చింతా రవికుమార్(42) తాను నివసిస్తున్న ఇంట్లో వంటగదిలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం మృతి చెందిన సంఘటన స్థానికంగా సంచలనం రేపింది. మృతుడు తన వద్ద 50 వేల నగదును తన అంత్యక్రియలు ఘనంగా నిర్వహించాలని సూసైడ్ నోట్ లో పేర్కొన్నట్లు ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. మృతుడు బంధువులు గాని పుట్టిన స్థలం గాని మరి ఇతర సమాచారం తెలియరాలేదని ఎస్సై తెలిపారు. మృతుడు గత నాలుగేళ్ళుగా చీపురుపల్లి పట్టణం కొత్త గౌడవీధిలో ఎన్ఆర్‌కే వింగ్స్ రెస్టారెంట్ ను నడుపుతున్నాడని ఎస్సై తెలిపారు. రెస్టారెంట్ తో పాటు మృతుడు షేర్ మార్కెట్ వ్యాపారం కూడా చేస్తుంటాడని స్థానికుల సమాచారం మేరకు తెలిసినట్లు ఎస్సై కే కిరణ్‌కుమార్ నాయుడు వివరించారు. మృతికి గల కారణాలు పూర్తి వివరాలు తెలియవన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాయుడు తెలిపారు.

టిడిపి కౌన్సిల్ సభ్యులు వార్డు లో అభివృద్ధి పనులు జరగటం లేదని ఆవేదన !

విశాలాంధ్ర-బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావే శాలలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి ఎజెండా లో నివేదికను అర్ఐ సురేష్ బాబు కౌన్సిల్ సభ్యులకు చదివి వినిపించారు.అనంతరం టిడిపి కౌన్సిల్ సభ్యులు రాంబారికి శరత్, వెలగాడ హైమావతి , గెంబలి శ్రీనివాసరావు, బొత్స సురేష్, లు టిడిపి కౌన్సిల్ సభ్యులు వార్డుల్లో అభివృద్ధి పనులు జరగటం లేదని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఐదవ వార్డు కౌన్సిల్ సభ్యులు వెలగాడ హైమావతి మాట్లాడుతూ తమ వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగినప్పుడు తమకు సంబంధించిన మున్సిపల్ అధికారులు సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీనిపైన మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మాట్లాడుతూ ఇకపై సమస్యలు రాకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పట్టణంలో పానీపూరి ఆహారం వల్ల పలు రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాటిపైన ఆహార తనిఖీ అధికారులు వారిచేత ప్రత్యేకత తనిఖీలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మూడో వార్డు కౌన్సిల్ సభ్యులు తమ అవార్డుల్లో ఎటువంటి అభివృద్ధి జరగట్లేదని మహిళలు వ్యక్తిగత మరుగుదొడ్లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో మున్సిపల్ అధికారులు నిర్మాణం చేపట్టిన సులభ కాంప్లెక్స్ మరమ్మత్తులు చేపట్టాలని గత మూడు సంవత్సరాలుగా అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న చర్యలు చేపట్టలేదని, అదేవిధంగా చాకలి వీధిలో 25 కుటుంబాలకు తాగునీరు ఇబ్బందిగా ఉందని చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో టిడిపి కౌన్సిల్ సభ్యులు గెంబలి శ్రీనివాసరావు , టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్ ఆర్టీసీ లో అప్రెంటిస్ షిప్ కు ఐటిఐ పాసైన అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎపిఎస్ ఆర్‌టిసి లో అప్రెంటిస్ షిప్ చేసుకునేందుకు ఐటిఐ పాసైన అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆన్ లైన్ లో ఆహ్వానిస్తున్నట్లు ఆర్టిసి జిల్లా అధికారి అయిన అప్పల నారాయణ తెలిపారు. అప్రెంటిస్ షిప్ దరఖాస్తు కోసము ఆగష్టు నెల 1వ తేది నుండి 16 వ తారీఖు వరకు అభ్యర్థులు వారి పేర్లను ఆన్ లైన్ వెబ్ సైట్ www.apprenticeshipindia.gov.in విజయనగరం జిల్లాకు సంబంధించి డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, వేల్డర్, షీట్ మెటల్ వర్కర్, ఫిట్టర్, పెయింటర్, మేషినిస్ట్ మరియు డ్రాఫ్ట్ మాన్ (సివిల్) తదితర ట్రేడ్ లకు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ కు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆగష్టు నెల 23 వ తేదీ ఉదయం 10 గంటల నుండి ప్రారంభం అవుతుందని ఈ సర్టిఫికేట్ వెరిఫికేషన్ యొక్క ప్రక్రియ ఆర్టిసి జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల, వీటి అగ్రహారం, విజయనగరం లో ఎంపికైన అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

తెర్లాం తహసీల్దార్ గా జీ.హేమంత్ కుమార్ భాధ్యతలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం తహసీల్దార్ గా భాధ్యతలు స్వీకరించిన జీ.హేమంత్ కుమార్. బుధవారం తన విధి నిర్వహణలో భాగంగా విలేకర్ల తో మాట్లాడుతూ విశాఖపట్నం, జామి, ఎస్ కోటల లో పనిచేసి ఇప్పుడు తెర్లాం తహసీల్దార్ గా కలెక్టర్ ఆదేశాలు మేరకు భాధ్యతలు స్వీకరించానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-జామి : మండల కేంద్రమైన జామిలోని విశాఖ- రాయపూర్ హైవే రింగ్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్కవరపుకోట మండలం భీమాలి గ్రామానికి చెందిన నెల్లి గౌరీ నాయుడు(34) మంగళవారం మధ్యాహ్నం ఎల్. కోట మండలం గొల్జాం గ్రామం నుంచి భీమాలికి మోటార్ సైకిల్ పై వస్తుండగా,జామి లోని రింగ్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు రైలింగ్ ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గౌరి నాయుడు తీవ్ర గాయాలు పాలవగా, అతనిని విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు గౌరీ నాయుడు భార్య మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీ క్రమశిక్షణ, అంకితభావమే ఉద్యోగులకు స్ఫూర్తిదాయకం

ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: సుదీర్ఘకాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన (1) దిశ పోలీసు స్టేషను డిఎస్పీ టేకి మోహనరావు (2) బొబ్బిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ సేపాన తిరుమలరావు (3) విజయనగరం రూరల్ హెడ్ కానిస్టేబులు పాండ్రంకి వాసుదేవరావు లకు జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ... పోలీసుశాఖకు మంచి సేవలందించి నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న డిఎస్పీ టేకి మోహనరావు, సిఐ తిరుమలరావు, హెచ్సీ వాసుదేవరావులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు విధులను నిర్వహించడంలో క్రమ శిక్షణ, అంకిత భావంతో పని చేసి, ఇతర పోలీసు ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. పోలీసు ఉద్యోగంలో ప్రతీ రోజూ ఒక కొత్త రకమైన సవాలు ఎదురవుతునే ఉంటుందని, వాటిని సమయ స్ఫూర్తితో ఎదుర్కొని, సవాళ్ళను అధిగమించాల్సి ఉంటుందన్నారు. గతంలో జిల్లాలో మావోయిస్టుల ప్రభావం తీవ్రంగా ఉండేదని, జిల్లాలో పని చేసిన అధికారులు, సిబ్బంది సమర్ధవంతంగా పని చేయడం వలన నేడు జిల్లాలో మావోయిస్టుల ప్రభావం కనుమరుగైందన్నారు. మావోయిస్టు కార్యకలాపాలను నియంత్రించుటలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వహించడంలోను, వారి పిల్లలను ఉన్నతంగా తీర్చి దిద్దడంలోను వారి భాగస్వామ్యుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉద్యోగ విరమణ తరువాత పోలీసు ఉద్యోగులు తమ సమయాన్ని తమ ఆరోగ్యంపైనా, కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెచ్చించాలని జిల్లా ఎస్పీకోరారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు తమ సర్వీసులో ఎదురైన అనుభవాలను, విలువైన సలహాలను పోలీసుశాఖకు అందించాలన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన డిఎస్పీ టేకి మోహనరావు, సిఐ తిరుమలరావు, హెచ్సి వాసుదేవరావు దంపతులను పోలీసుశాఖ తరుపున ఘనంగా సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదే విధంగా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జిల్లా ఎస్పీ జ్ఞాపికలను, చెక్లను అందజేసారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులు వారి. సర్వీసులో సహకరించిన అధికారులకు, సిబ్బందికి తమ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుశాఖ తరుపున ఎస్పీ తమకు అత్మీయ వీడ్కోలు ను పలకడం, సన్మానించడం తమ జీవితంలో ఎన్నటికీ మరువలేమని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, డిఎస్పీ యూనివర్స్, ఎస్బీ సిఐ ఇ.నర్సింహమూర్తి, దిశ సిఐ బి. నాగేశ్వరరావు, పోలీసు కంట్రోల్ రూం సిఐ సిహెచ్.రాజశేఖర్, ఆర్బలు గోపాల నాయుడు, భగవాన్, రమేష్ కుమార్, పోలీసు అసోసియేషను అడహక్ సభ్యులు కే.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీసు కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటివద్ద నే పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

తొలిరోజే శతశాతం పంపిణీ కి ఏర్పాట్లు

2,80,352 మంది లబ్దిదారులకు 116.67 కోట్ల పంపిణీ

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర- విజయ నగరం: ఆగష్టు నెలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్దిదారులకు ఇంటివద్దనే చెల్లించ డానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసింది. జిల్లాలో 2,80,352 మంది వృద్ధాప్య, వితంతు, చేనేత, కళాకారులు వికలాంగ తదితర పింఛన్ దారులకు 116.67 కోట్ల పంపిణీ చేయుటకు అవసరమగు నగదును బ్యాంకుల నుండి డ్రా చేయడం జరిగింది. ఈ పంపిణీ లో సచివాలయ, గ్రామ స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు 5,295 మంది భాగస్వామ్యం కానున్నారు. గత నెల పింఛన్ల పంపిణీ లో మొదటి రోజున 97.02 శాతం పంపిణీ చేసి రాష్ట్రం లోనే జిల్లా ప్రథమ స్థానం లో నిలిచింది. ఆగష్టు నెల శత శాతం పంపిణీ జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం. ఉదయం 5 గంటల నుండే పంపిణీ జరుగుతుంది. బయట ప్రాంతాల్లో ఉంటున్న పించన్ దార్లు సాయంత్రం లోగా వారి గ్రామాలకు విచ్చేసి పించన్ అందుకువాలని విజ్ఞప్తి చేస్తున్నాను. పించన్ పంపిణీ తీరును డి.ఆర్.డి.ఎ లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నుండి పర్యవేక్షించడం జరుగుతుంది.

విధి నిర్వహణలో సీహెచ్ఓ సూరప్పడు ఆదర్శనీయం

ఘనంగా పదవీ విరమణ సభ

విశాలాంధ్ర-గుర్ల: సమాజ సేవయే పరమావధిగా నలభై ఏళ్లపాటు సీ హెచ్ ఓ గా విధులు నిర్వర్తించిన గుర్ల పి. హెచ్. సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరుగా పనిచేసిన నక్కా సూరప్పడు వైద్య సిబ్బందితో పాటు అందరకీ ఆదర్శనీయమని ఎంపీడీఓ వెంకటరమణ వ్యాఖ్యానించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో గుర్ల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరుగా విధులు నిర్వహించి రిటైర్ అయిన నక్క సూరప్పడుకు పీ. హెచ్.సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒడుదొడుగులు ఎదుర్కొంటూ, బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేయడంలో ఆయన ఆదర్శనీయమన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, అంకితభావంతో పనిచేసేతత్వం, ఎదుగుతూపాటు ఒదిగే లక్షణాలల్లో ఆయనను చూసి నేర్చుకోవచ్చన్నారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ సూరప్పడు ఆసుపత్రికి వచ్చిన రోగులతో పాటు వైద్య సిబ్బంది ఆదర్శప్రాయమన్నారు. హెల్త్ సూపర్ వైజర్ ఉమా సభ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో ముందుగా సీ హెచ్ ఓ సూరప్పడు, కృప దంపతులకు దుస్సాలువ కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పద్మావతి సన్మాన పత్రం అందజేశారు. అంబేద్కర్ ఇండియా మిషన్ విజయనగరం జిల్లా ఇంచార్జి అద్దూరి సీతబాబు, కన్వీనర్ కెల్ల భీమారావులు తమ ఎయిమ్ సంఘ సభ్యులతో కలిసి సన్మాన గ్రహీతకు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, గుర్ల పీ హెచ్ సి వైద్యాధికారులు డా. చెన్నైజి, డా.కే శ్రీధర్, తెట్టంగి పీ హెచ్ సి వైద్యాధికారి డా.స్వప్న కుమారి,హెూమియోపతిక్, నేచురోపతి వైద్యాధికారులు డా. వెంకట మధు, డా.రజిత లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకి యువత దూరంగా ఉండాలి

సిటీయు వీసీ ఆచార్య తేజస్వి కట్టమణి

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : మత్తు పదార్ధాలు, మాదక ద్రవ్యాలవాడకం మరియు రవాణా చేయడం తీవ్రమయిన నేరమని అటువంటి వాటి జోలికి యువత ఆకర్షితులు కాకుండా ఉండాలని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య తేజస్వి కట్టమణి పిలుపునిచ్చారు. యూనివర్సిటీ ఇంటర్నల్ కాంప్లయింట్స్ కమిటీ ఆధ్వర్యం లో బుధవారం యూనివర్సిటీ ప్రాంగణం లో మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా, లైంగిక వేధింపుల యొక్క చట్టపరమైన అంశాలపై జరిగిన వర్కుషాపు లో భాగంగా ప్రొఫెసర్ టీవి కట్టమణి మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, మధ్యం, సిగరెట్, గుట్కాలు తదితరమైన మత్తుపదార్ధాల వ్యాసనానికి గురి కాకుండా తమ దృష్టి ని చదువుపై కేంద్రీకరించి జీవితంలో ఉన్నతిని సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవా సమితి అధ్యక్షురాలు కె విజయ కళ్యాణి మాట్లాడుతూ ర్యాగింగ్, ప్రేమ వ్యవహారాలు, మత్తు పదార్ధాల సేవనం, రవాణా యువతను నిర్వీర్యం చేస్తున్నాయని అందువలన తమతమ లక్ష్యాలకు దూర మవ్వడమే కాకుండా తమ తల్లి తండ్రులను, కుటుంబాన్ని కూడా న్యాయ పరమైన సమస్యలలోకి నెడుతున్నారని ఇటువంటి విషయాలలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం దిశ డిఎస్పీ డి.విశ్వనాథ్ మాట్లాడుతూ యువతీ తీవకులు చట్టపరమైన చిక్కులలో చిక్కకుండా ఏ విధంగా తమ జీవితాన్ని ఉన్నతంగా ఆదర్శవంతంగా మచి భవిష్యత్తు వైపు ఏవిధంగా మరల్చాలో వివరించారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్స్ వి ఎస్ ప్రసాద్, టూ టౌన్ సిఐ కె రామారావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు, ఐసిసి అధ్యక్షురాలు డా. పరికిపండ్ల శ్రీదేవి, డా.అనిరుధ్ కుమార్, డా.దివ్య, డా. ప్రమా, డా. కుసుమ్, డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ తదితర అద్యాపకులు, ఆద్యాపకేతరులు, విద్యార్దులు పాల్గొన్నారు.

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లు పెంచాలి

మహాజన సభలో పర్సన్ ఇన్ఛార్జ్, జెసి కార్తీక్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్లు, పెట్టుబడులను పెంచేందుకు కృషి చేయాలని ఆ బ్యాంకు పర్సన్ ఇన్ఛార్జ్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. బ్యాంకు మహాజన సభ బుధవారం బ్యాంకు సమావేశమందిరంలో జరిగింది. గత ఆర్ధిక సంవత్సరంలో బ్యాంకు సాధించిన ప్రగతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్య కలాపాలు, తీసుకోవాల్సిన చర్యలను ఇన్ఛార్జి సిఇఓ సిహెచ్ ఉమామహేశ్వరరావు వివరించారు. బ్యాంకు 107వ వార్షిక నివేదికను సభ్యుల ముందుంచారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, డిసిసిబి వ్యాపారం మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే, గత ఆర్థిక సంవత్సరంలో 14.3 శాతం వృద్ధి సాధించడం శుభపరిణామమని పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం లో రూ.183865.32 లక్షలు కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.210153.21 లక్షలు వ్యాపారం జరిగిందని తెలిపారు. అదే సమయంలో బ్యాంకు స్వంత నిధులు 14.14 శాతం వృద్ధితో, రూ.16412.38లక్షలు నుంచి రూ.18732.46లక్షలకు పెరిగాయని చెప్పారు. బ్యాంకు డిపాజిట్లు రూ.27654.41లక్షలు నుంచి 9.27శాతం వృద్ధితో 30218.44లక్షలకు పెరిగాయని తెలిపారు. బ్యాంకు పెట్టుబడులు 16.36 శాతం, ఆప్కాబ్ వద్దనుంచి రుణాలు కూడా సుమారు 17.5 శాతం పెరిగాయని తెలిపారు. బ్యాంకు 2022-2023 ఆర్థిక సంవత్సరంలో 729.37 లక్షల నికల లాభాన్ని ఆర్జించగా, 2023-24 సంవత్సరంలో 746.26లక్షల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. ఎన్పిఏను తగ్గించాల్సిన అవసరం ఉందని, అలాగే డిపాజిట్లను మరింత పెంచేందుకు కృషిచేయాలని కోరారు. పిఏసిఎస్లను కంప్యూటరీకరించాలని, జవాబుదారీ తనాన్ని పెంచాలని జెసి సూచించారు. నాబార్డు డిడిఎం నాగార్జున మాట్లాడుతూ, డిసిసిబి బ్యాంకు పరపతిని పెంచాలని కోరారు. ముఖ్యంగా డిపాజిట్లను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకు సుమారు రూ.1528 కోట్లు నాబార్డు ద్వారా రీఫైనాన్స్ చేయడం జరుగుతోందన్నారు. పిఏసిఎస్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ఆదాయం పెంచుకొని బలోపేతం కావాలని సూచించారు. జిల్లా సహకార అధికారి రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో 65 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, వీటిలో కేవలం 10 మాత్రమే లాభాల్లో ఉన్నాయని అన్నారు. మిగిలిన వాటిని కూడా లాభాలబాట పట్టించడానికి తగిన కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. వైద్యనాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు నష్టాలను తగ్గించేందుకు పలు చర్యలు తీసుకోవాలని కోరారు. మహాజన సభలో పార్వతీపురం మన్యం జిల్లా సహకార అధికారి శ్రీరామ్మూర్తి, డిసిఏఓ శ్రీరామ్మూర్తి, పిఏసిఎస్ల పర్సన్ ఇన్ఛార్జులు, డిసిసిబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

విశాలాంధ్ర -రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు గురువారం ఉదయం తిమ్మయ్య పేట, గాయత్రి కాలనీ తదితర వార్డులను విజిట్ చేసి కాలువలు, రోడ్లను మంచినీటి సరఫరా గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కొళాయి నీటిని స్వయంగా తాగి కమిషనర్ పరిశీలించడం జరిగింది. కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రసాద్ శానిటేషన్ సిబ్బందితో డయేరియా, మలేరియా వంటి వ్యాధులు రాకుండా బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సానిటరీ సెక్రటరీలు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం తంగుడిబిల్లి వైసిపి నాయకులు వాల్లె నాగేశ్వరరావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు బుధవారం పరామర్శించారు. నాగేశ్వరరావు పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ విద్యార్థి సాయి భీమిలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే ఆ కుటుంబాన్ని నెల్లిమర్లలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయి ఆత్మకి శాంతి చేకూరాలని కోరారు. పరామర్శలో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఉన్నారు.

యువతకి ఉద్యోగాలు కల్పించాలని ఎమ్మెల్యేకి వినతి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నియోజకవర్గంలోని యువతకి స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వినతి పత్రం అందించారు. నెల్లిమర్ల నగరపంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యేకి కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పైల భారతి బుధవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్ చదివిన యువత ఉన్న ఇక్కడ ఉన్న కంపెనీలు స్థానికులు అని సాకు చూపించి ఉద్యోగాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఫలితంగా ఇక్కడ యువత ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు ఉద్యోగాల కోసం వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. స్థానిక ఫార్మా కంపెనీలు స్థానికేతరులకు ఉద్యాలు ఇస్తున్నాయని తెలిపారు. అలాగే నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాలను 2014లో నగరపంచాయతీ చేయడం వల్ల ఈ రెండు గ్రామాలలో ఉపాధి పనులు నిలిపివేశారని, ఫలితంగా పేదలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. వీరికి ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా ఉపాధి కల్పించాలని కోరారు.

ప్రజలకు సేవచేయడం ఆనందదాయకం: ఎంపిపీ

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ఉద్యోగరీత్యా ప్రజలకు సర్వీస్ చేయడం బాధ్యతతో కూడిన ఆనందదాయకమైన పనిని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు మండలంలోని బుధవారం పంచాయతీ కార్యదర్శి దేముడు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రావణి కళ్యాణమండపం లో ఏర్పాటుచేసిన కార్యదర్శి సన్మాన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యోగ జీవిత కాలంలో కార్యదర్శి దేముడు అధికారులు ఇటు ప్రజలు మధ్య వారధిగా నిలిచి సమస్యలు పరిష్కరించడంలో మంచి పేరు తెచ్చుకున్నారని బదిలీలు, ఉద్యోగ విరమణ అనేది సహజమని ఆయన అన్నారు. కార్యదర్శి దేవుడు మాట్లాడుతూ జీవితంలో ఉద్యోగ జీవితం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎక్కడా రాజీలేని ప్రజలకు సర్వీసు చేశానని ఆయన అన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా తమ దంపతులకు సన్మానం చేయడం సంతోషకరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే రూపేష్, ఈవో అండ్ పి ఆర్ జి జ్ఞానేశ్వర్ రావ్, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాములవలస పంచాయతీ లో దోమలమందు పిచికారీ

విశాలాంధ్ర -తెర్లాం: మండలంలో బుధవారం పాములవలస పంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి చప్ప.ఈశ్వరరావు,సెక్రటరీ కే. అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రామ ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని దగ్గరుండి దోమల మందు పిచికారి చేస్తూ కాలువలో పూడికలు తీయిస్తూ గ్రామం అంతటా పరిశుభ్రం గా ఉండాలని చర్యలు చేపట్టారు. ఈ వర్షాకాలం అంత దోమలు భారీ నుండి ప్రజలను కాపాడడానికి గ్రామం లో ఎక్కడ సి సి కాలువల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రం గా ఉంటే ప్రజలను అనారోగ్యం బారిన పడకుండా కాపాడగలం అని చప్ప. ఈశ్వరావు తెలిపారు

ఆరోగ్యకరమైన అలవాట్లను పిల్లలకు నేర్పించాలి

డిప్యూటీ డిఈఓ మోహనరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఈ విద్య సంవత్సరం జిల్లాలోని ఏంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలకు చేతుల పరిశుభ్రత మరియు ఆరోగ్య వంతమైన అలవాట్ల గురించి పాఠశాల విద్యాశాఖ డేటాల్ బనేగా స్వస్థ్ ఇండియా (డిబియస్ఐ) సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు బొబ్బిలి ఉప విద్యాశాఖ అధికారి కే .మోహన్ రావు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం స్థానిక ఓ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహించారు, ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అల వాట్లను విద్యార్థులకు పాఠశాలలలో చదువులతో పాటుగా నేర్పించినప్పుడే మానసికంగా శారీరకంగా పరిపూర్ణమైన విద్యార్థి గా తయారవుతారని, చేతుల పరిశుభ్రత ద్వారా 80శాతం రోగాలను దరిచేరనీయకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు. కేవలం పుస్తకాలలో ఉన్న విషయాలను మాత్రమే కాకుండా పరిశుభ్రత ఆరోగ్యం మంచి అలవాట్లు నడవడిక గురించి విద్యార్థులకు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైన ఉందని అన్నారు. సబ్బుతో చేతులు కడుకున్నప్పుడు ఏడు రకాల సూత్రాలను పాటించాలని , చేతులు కడిగే సమయంలో చేతి గోళ్ళు సందుల్లో ఎలాంటి మురికి లేకుండా ఉండేలా శుభ్రపరచుకోవాలని, ఆహారం తీసుకునే సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కొని, ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు . మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే ఉంటుందని చాలాసార్లు వినే ఉంటాం. నిజంగా మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన చేతులు పరిశుభ్రంగా ఉంచు కోవాల్సిన అవసరం ఉందన్నారు. బొబ్బిలి ఎంఈఓ సిహెచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాలల్లో స్టూడెంట్ క్యాబినెట్, సోప్ బ్యాంక్ వంటి కొన్ని కొత్త విధానాల ద్వారా పిల్లలకు పరిశుభ్రత పైన మక్కువ పెంచే కార్యక్రమాలు చేపట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ టి లక్ష్మి , డిబియస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వి భగవాన్ దాస్, రిసోర్స్ పర్సన్ శంకరరావు, చైల్డ్ వెల్ఫేర్ సభ్యులు చిట్టిబాబు వివిధ మండలాల నుండి ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ మెరుగుకు కృషిచేయాలి : ఎమ్మెల్యే కోండ్రు

విశాలాంధ్ర-వంగర: విద్యావ్యవస్థ మెరుగుకు కృషి చేయాలని మాజీ మంత్రి, రాజాం శాసన సభ్యులు కోండ్రు మురళీమోహన్ రావు కోరారు. బుధవారం ఆయన మద్దువలస జూనియర్ కాలేజీ వద్ద ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, బ్యాగుల పంపిణీ చేశారు. అనంతరం ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఐఎఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎస్ఎఫ్ ట్రిబులైటీ తదితర వచ్చేటట్లు విద్యార్థులను తయారు చేయాలని ఆయన ప్రిన్స్ పాల్,లెక్చర రర్స్ ను కోరారు.ఈ విద్యార్థుల్లో 10 మందిని ట్రిబులైటీ కి ఎంపికయ్యే టట్లు చూడాలని ఆయన జూనియర్ కాలేజీ సిబ్బందిని కోరారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివేవారికి ఇంటర్మీడియట్ బుక్స్ బయట కొనుగోలు చేయాలంటే తీవ్ర ఆర్థిక భారం అవుతోందని ఎన్నికల సమయంలో ఇంటర్ విద్యార్థులకు కూడా ఉచితంగా బుక్స్ అందజేస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారనీ ఈ హామీ మేరకు నేడు ఈ హామీని నెరవేర్చి మాట నిలబెట్టామన్నారు. ముందుగా మహిళా విద్యార్థులకు పలుప్రశ్నలు వేశారు. ఇంటర్ చదువుతున్న అంజిలీని, బూరాడ ప్రమీల, పల్లి దనలక్ష్మి, లకు మీరేం చదువుతారు. ఉన్నత చదువులు చదవాలని వారిని కోరారు. అనంతరం ఆయన్ని మద్దు వలస బీ అర్ అంబేద్కర్ మహిళా జూనియర్ కాలేజి కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి మమ్మలను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు కి వినతిపత్రం అందజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సిబ్బంది కాంట్రాక్టు ఉపాధ్యా యులుగా పని చేస్తున్నామని, ఇప్పటికి మాకు రెగ్యులర్ కాలేదని 2007 కు ముందు నుండి పనిచేస్తూ వున్నా కాంటాక్ట్ సిబ్బందిని జీవో నెంబర్ 59 ద్వారా రెగ్యులర్ చేశారు అని మమ్మల్ని కూడా రెగ్యులర్ చేయాలనీ వారు కోరారు. అలానే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ గా పని చేస్తున్న సిబ్బంది, వారిని కాంట్రాక్టు నుండి రెగ్యుల ర్ చేయాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండ్రు మురళిమోహన్కు వినతి ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ మీ సమస్యపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టిలో పెట్టి పరిష్కరించు కృషి చేస్తానని వారికీ అయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ బొత్స వాసు దేవరా వు నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పైల వెంకటరమణ, రాజాం నియోజవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు మజ్జి గణపతి, ఉదియాన మురళీకృష్ణ, పి.మోహన, లచ్చుభక్త కృష్ణ, తదితర నాయకులు జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ కొ రటాన నారాయణ రావు,లెక్చిరర్లు ఎం.గణపతి నాయుడు, ఎస్.శ్యామల దేవి, బలగ పోలినాయుడు, టీ.ఈశ్వరరావు, జీ.సత్యన్నారాయణ,ఎల్.సురేష్ బాబు, బీ.కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, ఎస్.సురేష్, వై.గీత, జీ.వెంకటేష్ బాబు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

వేక్సిన్ తీసుకుంటే ముందుగానే గర్భాశయ కేన్సర్ ను నివారించవచ్చు

అంకాలాజిస్ట్ డాక్టర్ లీల

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : గర్భాశయ కేన్సర్ నివారణకు ముందుగా వేక్సిన్ ను తీసుకుంటే తప్పకుండా గర్భశాయ కేన్సర్ ను నివారించవచ్చునని, ఈ వేక్సిన్ వలన ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని హైదరాబాద్ నుండి వచ్చిన ప్రముఖ అంకాలాజిస్ట్ డాక్టర్ లీల అన్నారు. బుధవారం పేర్లవారి వీధిలో ఉన్న చెవిటి, మూగ పిల్లల పాఠశాల ఆవరణలో సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ది డిఫెన్స్ & బ్లైండ్, మానవసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భాశయ కేన్సర్ పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లీల మాట్లాడుతూ మన దేశంలో ఎక్కువ మరణాలు గర్భాశయ కేన్సర్ వలనే సంభవిస్తున్నాయని, పదు నాలుగు సంవత్సరాలనుండి ఇరువదిఆరు సంవత్సరాల వయస్సు వారికీ మూడు డోసులు అవసరమని అన్నారు. పాఠశాలలో విదర్దినీ విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరిస్తే ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేయడమే గాక ఉచితంగా వేక్సిన్ ను మానవ సేవా ట్రస్ట్ వారు ఏర్పాటు చేస్తారని తెలిపారు. సొసైటీ కార్యదర్శి కె.ఆర్.డి. ప్రసాదరావు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఉన్న విద్యార్థుల కోసం ఈ అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సొసైటీ అధ్యక్షులు టి. అప్పారావు అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో వికాశ తరంగిణి సంస్థ ప్రతినిధి శ్రీమతి శంకుంతుల, మానవ సేవాట్రస్ట్ సభ్యులు ఎం. సుధాకర్, సొసైటీ సభ్యులు టి. వెంకటేశ్వరరావు, వి. రాజగోపాల్, పి. శ్రీనివాసరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు. చివరిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పలరాజు వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

సత్య సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండల కేంద్రంలో ఉన్న సుబ్బిరాంరెడ్డి కళ్యాణ మండపంలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 15 మంది వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు రోగులు వైనిపిరానికి వచ్చి తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు తెలియజేసి చికిత్సపొందారు కార్యక్రమానికి హాజరైనటువంటి రోగులకు అవసరమైనటువంటి వారికి ఉచిత రక్త పరీక్షలు అవసరమైనటువంటి పరీక్షలు నిర్వహించే ఉచితంగా మందులు అందజేశారు కార్యక్రమంలో సత్యసాయి సేవ ట్రస్ట్ భక్తులు మరియు సేవకులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పంచాయతీ అభివృద్ధి

విశాలాంధ్ర-నెల్లిమర్ల : పార్టీలకు అతీతంగా నగరపంచాయతీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నగరపంచాయతీ కార్యాలయంలో చైర్ పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి ఎజెండాలోనే అంశాలను అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేరుకే నగరపంచాయతీ అయినా మౌలిక సదుపాయాల విషయంలో పంచాయతీ కన్నా అధ్వాన్నంగా ఉందని చెప్పారు. ముఖ్యంగా నగరపంచాయతీలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేజ దృష్టి సారించాలని సూచించారు. నగరపంచాయతీకి ఆదాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. ముందుగా అసంపూర్ణంగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. 576 టిడ్ కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే అన్నా క్యాంటీన్ మిగిలిన పనులు రూ.11 లక్షలతో నిర్మాణం పూర్తి చేయాలని కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే వీధి కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేయడానికి తీర్మానం చేశారు. మిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలకు, ఖాళీ స్థలాలకు పూర్తి స్థాయిలో పన్నులు చెల్లించడం లేదని సభ్యులు ప్రశ్న లేవనెత్తారు. మిమ్స్ ఏడాదికి రూ.52 లక్షలు చెల్లిస్తోందని మేనేజర్ విశ్వేశ్వరరావు సమాధానం ఇచ్చారు. మిమ్స్ జూట్ మిల్ యాజమాన్యం ఇంతవరకూ రూ.6.94 కోట్లు బకాయిలు చెల్లించలేదని అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. దీనిపై యాజమాన్యం కోర్టుకు వెళ్లిందని చెప్పారు. అయితే ప్రభుత్వం మిల్ యాజమాన్యానికి పన్నుపై రూ.3.64 కోట్లు రాయితీ ఇచ్చినా పన్ను చెల్లించడానికి ముందుకు రాలేదని చెప్పారు. జూట్ మిల్ కేసు ఫైల్ తనకు సమర్పంచాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నెల్లిమర్ల జూట్ మిల్ యాజమాన్యం తరచూ లాకౌట్లు వేస్తోందని కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జూట్ మిల్ ను నమ్ముకోకుండా ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై ఎమ్మెల్యే సవిరంగా విన్నారు. నగరపంచాయతీ నిధులు చూసుకుని ప్రాధాన్యత ప్రకారం పనులు చేద్దామని చెప్పారు. ప్రతి నెల నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశానికి తాను విధిగా హాజరవుతానని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పాండ్రింకి సత్యవతి, చిక్కాల సంతోష్ కుమార్, బూర సుజాత, కల్యాణం సత్యనారాయణ, మజ్జి అన్నపూర్ణ, పైల భారతి, నరవ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి